## మరపురాని మనుషులు

# ఎంత గొప్ప వ్యక్తిత్వం?



## (డా. బెజవాడ గోపాలరెడ్డి గారు)

ఆరడుగుల పొడవు, పచ్చని శరీరచ్ఛాయ, ఆజానుబాహుడు అంటే అబద్ధం కాదు. ఆకారానికి తగ్గట్టుగా గంభీరమైన వ్యక్తిత్వం. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ నాయకుడిగా అనేక ఉద్యమాలలో పాల్గొని భరతమాత బానిసత్వపు సంకెళ్ళు తెంచి స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి నడుం కట్టుకున్న గాంధేయవాది. స్వాతంత్ర్యానంతరం, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా అనేకమైన ఉన్నత పదవులు నిర్వహించి, వారికి వారే సాటి అనిపించుకున్న నెల్లూరు పులి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు. ఇదంతా ఒక ఎత్తయితే, సారస్వత ప్రయత్నం వారి నైజం. గొప్ప సాహితీవేత్త. కవి, విమర్శకులు. సాహిత్య అకాడమీలకు వెన్నెముకగా వుండేవారు. సరస సంభాషణ, సరదాగా గడపడం మంచి మిత్రుల మధ్య, సాహితీ మూర్తుల మధ్య ... వారికెంతో ఇష్టం. అప్పుడప్పుడే రాస్తున్న వారిని ప్రోత్సహించడం, బాగా రాస్తున్న వారిని గౌరవించడం వారి ప్రవృత్తి.

1968, 70ల మధ్య అనుకుంటా హైదరాబాద్‌లోని వంశీ ఆర్ట్స్ థియేటర్ రామరాజు గారు నా గీతాలపై రవీంద్ర భారతిలో సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమానికి డా. గోపాలరెడ్డి గారిని ముఖ్య అతిథిగా పిలిచారు. ఆయన ఆనందంగా అంగీకరించారు. కానీ, కార్యక్రమం ఒక పది రోజులుందనగా, వారి అబ్బాయికి చాలా సుస్తీ చేసి ఆసుపత్రిలో చేర్చడం వల్ల రాలేక పోతున్నానని ఉత్తరం రాస్తూ, నాకో సలహా ఇచ్చారు. ''అమ్మా! ఏ సినిమా ప్లేబాక్ సింగర్స్ కానీ, నటులుగానీ లేకుండా ఈ కార్యక్రమాన్ని రవీంద్ర భారతి అంత పెద్ద హాలులో పెడితే, హాలు నిండకపోతే బాగుండదు. వెన్యూ మార్చుకోకూడదూ'' అని రాశారు.


నేను దానికి వెంటనే క్షణమైనా ఆలోచించకుండా, అమాయకత్వమో, అజ్ఞానమో, చిన్నతనమో తెలీదు కానీ, సమాధానం ఇలా రాశాను. 'గోపాలరెడ్డి గారూ! మై ... ఫ్రెండ్స్ ... ఆర్ ... మై ... ఎస్సెట్స్. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లో. నా ఫ్రెండ్స్ మా వారి ఫ్రెండ్స్, నాన్న గారు, మా మామగారి ఫ్రెండ్స్, వంశీ తాలూకు సంస్థ తరపు వారూ అందరూ వొస్తే హాలు నిండుతుందని నా నమ్మకం. మీరు రాలేకపోతున్నందుకు విచారిస్తున్నాను' అని రాశాను. అది చూసి వారు ఆశ్చర్యపోయి, నా కొలీగ్ వారి స్నేహితులూ శ్రీ ఎన్.వి.ఎస్. ప్రసాదరావు గారికి ఉత్తరం రాశారు. 'నువ్వు ఎలాగైనా శారద ఫంక్షన్‌కి వెళ్ళి, ఆ కార్యక్రమానికి ఎంత మంది వచ్చారు, ఎలా జరిగింది రాయమ'ని. ఆ ఉత్తరం వారు అలా ఎందుకు రాశారో ప్రసాదరావు గారికి తెలీదు. ఆ ఫంక్షన్‌కి, నేడు రాజాలక్ష్మీ ఫౌండేషన్ అధినేత శ్రీ రమణయ్య రాజాగారు వారి సతీమణితో సహా మద్రాసు నుంచి వచ్చి నన్ను పట్టుచీరతో సత్కరించారు. ఆనాటి సభలో డా. దాశరథి గారు, డా. నారాయణరెడ్డి గారు, శ్రీమతి దుర్గా భక్తవత్సల్, వాసిరెడ్డి సీతాదేవి, శ్రీమతి మాదిరెడ్డి సులోచన, డా. నాయని కృష్ణకుమారి గారు - అందరూ వేదిక మీద వుండాలి. ప్రసాదరావు గారు అరగంట ఆలస్యంగా రావడంవల్ల వారికి కూర్చోడానికి కుర్చీ లేదు ముందు వరసల్లో.


ఆ మాటలన్న గోపాలరెడ్డి గారు నా ఉత్తరం గురించి నా ఆత్మవిశ్వాసాన్ని గురించి ఎందరికో చెప్పి మురిసిపోయారు.


కొద్ది రోజుల్లో పోతారనగా వారికి నాదొక కవితా సంపుటి 'అక్షర చిత్రాలు' గ్రంథాన్ని అంకితం చేశాను. వారు నాకు ముందే చెప్పారు. 'నాకు సభలూ, సమావేశాలూ వద్దు. మీ ఇంటికొస్తాను. పుస్తకం నా చేతిలో పెట్టు. నలుగురు ఫ్రెండ్స్‌ని పిలువు. అలా అయితే అంకితం పుచ్చుకుంటా. లేకపోతే ఒద్దు' అని రాశారు. 'నాకూ సభలూ, సమావేశాలూ వద్దు. మీరు మా ఇంటికి రావడం నాకు ఆనందం, గర్వకారణం. అంకితానికి ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు' అని రాశాను. మా ఇల్లు ఏడో అంతస్తులో వుందని తెలీగానే అమ్మో అన్నా, రెండు లిఫ్టులున్నాయని చెప్పగానే, వారు అలాగే అంటూ, వారి వెంట నెల్లూరు నుంచి వచ్చిన మరో నలుగురు మిత్రులని వెంట బెట్టుకుని, వారి పుస్తకాలూ, ఒక చక్కటి కాశ్మీరు శాలువా తీసుకుని దిగారు. వారి రచనలు నా చేతిలో పెట్టి శాలువా కప్పి, నా పుస్తకాన్ని వారు అందుకున్నారు. చిన్న అల్పాహార విందు కార్యక్రమం. 'ఏదీ ఏడంతస్తుల శారద' అని పిలవడం మొదలెట్టారు. ఆ మధురస్మృతి ఎన్నటికీ మరువరానిది. ఆ అడుగుజాడలు గుండెల్లో దాచుకోతగ్గవి. ఇవి ఎంత గొప్ప నిధులు!


**–శారదా అశోకవర్ధన్**

# ఇంటీరియర్ డెకరేషన్









కథ



# తప్పు నాదేనండీ!

-ముద్దంశెట్టి హనుమంతరావు

తెల్లవారిందగ్గర్నించి, వర్షపు జల్లులు నిర్విరామంగా పడుతూనే వున్నయ్. ఈదురు గాలులు వీస్తున్నాయి. గత రెండు రోజులుగా ఇదే వాతావరణం!

హరనాధరావు సోఫాలో కూచుని, న్యూస్ పేపరు చదువుకుంటున్నాడు. అతని చేతివేళ్ళ మధ్య సిగరెట్ వెలుగుతోంది. మధ్యమధ్య సిగరెట్ దమ్ములాగి పొగవదుల్తూ, ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తున్నాడు.

''ఏం చేస్తున్నారండీ?'' లోపల్నించి వస్తూ అంది అతని భార్య రాధిక.

''అర్థం లేకుండా, ఏవిటా ప్రశ్న? ఏం చేస్తున్నానో, అగుపించడం లేదూ?'' తన ఏకాగ్రతకి భంగం కలిగినందుకు విసుగ్గానే అన్నాడు హరనాధరావు.

''అంత విసుగైతే ఎలాగండీ! ఇలా మీరు పేపరు చదువుకుంటూ కూచుంటే ఎలా చెప్పండి!'' దీర్ఘం తీస్తూ అంది రాధిక.

''మరేం చెయ్యమంటావ్ రాధికా?''

''కాయగూరలు ఏమీలేవు. మార్కెట్టుకి వెళ్ళి తీసుకురండి'' అందామె.

హరనాధరావు గుండెలో రాయి పడింది. అటువంటి వాతావరణంలో ఆఫీసుకి వెళ్ళడం ఎట్లాగా అని ఆలోచిస్తూ వుంటే ఇప్పుడు మార్కెట్టుకి వెళ్ళమంటున్న భార్యపై నిజంగానే కోపం వచ్చిందతనికి. అతని హృదయ స్పందన అధికమయ్యింది. రోడ్లు ఎలా వున్నా, మార్కెట్టు పరిస్థితి తల్చుకుంటేనే అతనికి భయం వేస్తోంది. మార్కెట్టంతా బురదబురదగా వుంటుంది. జాగ్రత్తగా నడవకపోతే జారిపోయే ప్రమాదమూ వుంటుంది. అందుకే హరనాధరావు గుండెలో గుబులు ప్రారంభమయ్యింది.

''వాతావరణం ఇంత అధ్వాన్నంగా వుంటే ఎలా మార్కెట్టుకి వెళ్ళేది రాధికా? ఇంట్లో అసలు కాయగూరలేమీ లేవా? ఏదో విధంగా ఈ రోజు పెట్టెయ్ ...'' అన్నాడు హరనాధరావు.

రాధిక మొహం చిట్లించుకుంది. ''ఏ కాయగూరయినా వుంటే ఈ వాతావరణంలో మిమ్మల్నెందుకు ఇబ్బంది పెడతానండీ! లేకనే కదా! లేచి తొందరగా వెళ్ళొచ్చేయండీ...'' చిరాగ్గానే అంది రాధిక.

హరనాధరావుకి తప్పేటట్టు కనిపించలేదు. విసుగ్గా పేపరు మడతబెట్టి బల్లమీద పడేస్తూ లేచాడు. సిగరెట్‌ని యాష్‌ట్రేలో పడేశాడు.

''సరే, తప్పుతుందా? ఏం కాయగూరలు తీసుకు రమ్మంటావు?'' అన్నాడు.

''అనవసరంగా హరికథలు చెబుతూ కూచోకుండా ఏవో నాలుగు రకాలు తీసుకు రండి...''

''అలాగేలే. ఏదీ ఆ సంచీ, గొడుగూ అందుకో'' అంటూనే తన గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకుని, మర్చిపోకుండా మనీపర్సుని ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు హరనాధరావు.

రాధిక సంచీని, గొడుగుని తీసుకుని లోపల్నించి వచ్చింది.

''ఇదిగోండి. మార్కెట్టులో ఎవరో స్నేహితులు కనిపించారని మాట్లాడుతూ కూచోకండి. త్వరగా వెళ్ళి రండి. మీకు వంటవ్వాలి కదా! లేకపోతే, మీరు ఆఫీసుకి లేటవ్వడానికి, నేనే కారణమంటారు'' అంటూనే భర్తకి సంచిని, గొడుగుని అందించింది రాధిక.

హరనాధరావు అయిష్టంగానే బైటకి నిష్క్రమించాడు గొడుగు వేసుకుని. రాధిక లోపలికి వెళ్ళిపోయింది.

☆☆☆

వర్షపు జల్లులు ఉధృతం అయినట్టుగా అనిపించింది హరనాధరావుకి. గొడుగు వేసుకుని నడుస్తున్నాడు. రోడ్డంతా బురద బురదగా వుంది. 'ఎన్ని ప్రణాళికలు అమల్లోకి వచ్చినా ఈ రోడ్లు బాగుపడవు' ... అనుకున్నాడు మనసులో. చెప్పులతో ఆ బురదలో నడవడం, అతనికి సర్కస్ ఫీట్‌లానే అనిపిస్తోంది. గత రెండు సీజన్ల నుంచీ అనుకుంటున్నాడు సాండక్ పంపుషూ ఒకటి కొనుక్కుంటే ఇటువంటి వాతావరణంలో ఎంతో అనువుగా వుంటుందని. కానీ, బడ్జెట్ లోటువల్ల ఎప్పటికప్పుడే ఆ ఆలోచనని వాయిదావేస్తూ వస్తున్నాడు. 'ఈ సంవత్సరమైనా, ఆ పంపుషూ తప్పకుండా కొనుక్కోవాలి..' అనుకున్నాడు లోపల.

''నమస్కారమండీ హరనాధరావు గారూ ...'' చాలా రోజుల